క్లుప్తంగా

అణుజీవ శాస్త్రంపై అవగాహన

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం విభాగం బీఎస్సీ సెకండియర్ విద్యార్థులకు అణుజీవ శాస్త్రంపై కొత్తగూడెం టీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాల అధ్యాపకురాలు సంధ్యారాణి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, చదువులో రాణించి ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్, వైస్ ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, డాక్టర్ ఏ.శ్రీను, శ్యాంప్రసాద్, నాగసామీరా, పావని, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చర్ల నుంచి మేడారానికి బస్సులు

చర్ల: చర్ల బస్టాండ్ నుంచి మేడారానికి 24 గంటల పాటు ప్రత్యేక బస్సులు నడపుతున్నట్లు సత్తుపల్లి టీఎస్ఆర్‌టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం చర్ల నుంచి మేడారంకు ఏర్పాటు చేసిన బస్సు సర్వీసులను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. మేడారంలోని సమ్మక్క సారలమ్మల జాతర పూర్తయ్యేంత వరకు ఈ ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు, పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.140లుగా టికెట్టు ధర నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. ఈ సౌకర్యాన్ని చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన భక్తులతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర భక్తులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఇన్‌చార్జ్ సీహెచ్‌వీ కృష్ణారెడ్డి, సిబ్బంది ఎస్.మారేశ్వరావు, సీహెచ్‌వీ రమణ, సీహెచ్.కృష్ణయ్య, కెఎస్.రావు, బీఎంఎస్ రావు, జానీ పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పివికాలనీ కమ్యూనిటి హాల్‌లో ఏరియా జీఎం దుర్గం రామచందర్ ఆదేశాల మేరకు ఏరియా హౌస్ ఎలాట్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న సింగరేణి కంపెనీ క్వార్టర్ల కేటాయింపు కోసం సోమవారం ఏరియా అధికారులు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 70క్వార్టర్లకు గానూ 158మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా.. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి సీనియార్టీని పరిగణలోకి తీసుకుని క్వార్టర్లను కేటాయించారు. కౌన్సిలింగ్ ప్రక్రియను ఏరియా ఇన్‌చార్జ్ ఎస్ఓటు జీఎం వెంగళరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏరియా ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, సీనియర్ పీఓ సింగు శ్రీనివాస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ, జూనియర్ అసిస్టెంట్ శ్రియ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం, కళ్యాణపురం, ఆనందాపురం, మొండికుంట, మల్లెలమడుగు, నెల్లిపాక గ్రామ పంచాయతీలలో సీసీ రోడ్ల నిర్మాణాలకు సోమవారం ఎంపీపీ ముత్తినేని సుజాత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుజాత మాట్లాడుతూ.. మండలంలో అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమాలలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, జిల్లా, మండల కోఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, ఎస్‌కె.ఖదీర్, ఎంపీటీసీలు కమటం నరేష్, బేతం రామకృష్ణ, గాదె జయ, ఏఈ చక్రధరాచారి, ఏసీడీపీఓ రేవతి, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్రిజ్ వితరణ

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం బుర్ర సీతారాములు యాదవ్ తన తండ్రి మల్లయ్య జ్ఞాపకార్థంగా రూ.40 వేలు విలువ చేసే ఫ్రిజ్‌ను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగశ్రీకి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఫ్రిజ్‌ను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం దాత సీతారాములు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు గాజుల పూర్ణచందర్‌రావు, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ పిల్లారిశెట్టి హరిబాబు, సభ్యులు డాక్టర్ దుస్సా సమ్మయ్య, పిఆర్‌సి గాజుల రమేష్‌కుమార్, అడబాల నాగేశ్వరరావు, యాదవసంఘం మండల అధ్యక్షుడు మార్తి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మంగి మల్లికార్జున్, గోకులకృష్ణ సేవా సమితి ఉపాధ్యక్షుడు గోపి, సైదులు, నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయులు మధుకర్, పరమయ్య, శంకర్, ఇంద్రసేనా రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామార్చనలు, అన్నాభిషేకం, దూపదర్శనం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు.

ప్రమాదకరంగా వంతెనలు

- ఊడిపోయిన రెయిలింగులు, కనబడని సూచికబోర్డులు
- ఆందోళనతో ఆదివాసీల ప్రయాణం
- మరమ్మతులు పట్టని అధికారులు



కుర్నపల్లి రోడ్‌లో తాలిపేరు కాలువ బ్రిడ్జిపై పూర్తిగా విరిగిపోయిన రెయిలింగ్

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో వాగులు, సాగునీటి కాలువలపై ఉన్న వంతెనల సైడ్ రెయిలింగ్‌లు ఊడి ప్రమాదభరితంగా ఉన్నాయి. ప్రాణ సంకటంగా తయారయ్యాయి. ఇక రాత్రి వేళల్లో అయితే ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని ప్రయాణం సాగించాల్సి వస్తోంది. అయినప్పటికీ అధికారులు వాటి మరమ్మతులపై దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండంపై ప్రజానీకం తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.

అనేక చోట్ల ఇదే తీరు..

మండలంలోని తేగడ సమీపంలోని హైలెవల్ వంతెనపై దండుపేట వైపు ఉన్న సైడ్ రెయిలింగ్ వాల్‌ను ఇటీవల ఇసుక లారీ ఢీకొట్టగా.. గోడ పగిలి వాగులో పడిపోయింది. కుదునూరు సమీపంలోని టపావాగు వంతెనపై ఆర్ కొత్తగూడెం వైపు నుంచి కువునూ వైపునకు వస్తున్న ఒక ట్రాక్టర్ అదుపు తప్పి సైడ్ రెయిలింగ్‌ను ఢీకొట్టి వాగులో పడి పోగా అక్కడ రెయిలింగ్ విరిగిపోయింది. మరోవైపు ఆర్ కొత్తగూడెం నుంచి దానవాయిపేట మీదుగా కుర్నపల్లికి వెళ్లే మార్గంలో తాలిపేరు ప్రధాన కాలువ వంతెనకు రెండు వైపులా ఉన్న రైయింలింగ్‌లను పలుమార్లు ట్రాక్టర్లు, టిప్పర్లు ఢీకొట్టడంతో రెండు వైపులా రెయిలింగ్ విరిగిపోయి ప్రమాదభరితంగా మారాయి. ఇక దేవరాపల్లి సమీపంలో ఉన్న జోడి చీలికల బ్రిడ్జీలు, చర్ల నుంచి వెంకటాపురం వెళ్లే మార్గం లోచర్ల శివారులో ఉన్న పడిదలమ్మగండి, రామాంజపురం క్రాస్‌రోడ్ సెంటర్, బీఎస్ రామయ్య నగర్, సుబ్బంపేట సమీపాల్లో ఉన్న వంతెనలకు ఇరువైపులా ప్రమాదభరితంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కనీసం ప్రమాద సూచికలను కూడా ఏర్పాటు చేయలేదు.

అదుపు తప్పితే అంతే సంగతులు..

చర్ల మండలంలోని పైన పేర్కొన్న ప్రాంతాల్లో ప్రయాణించే వారు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని ముందుకెళుతున్నారు. ఆయా ప్రాంతాలలో ఏ మాత్రం ఆదమరచినా ప్రాణాలు గాలిలే కలిసినట్లే. ఇదే ధోరణిలో ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయి. పెద్దస్థాయిలో ప్రమాదాలు, ప్రాణనష్టం జరగకముందే అధికారులు మేల్కొనాలని స్థానికులు కోరుతున్నారు.

రెయిలింగ్‌లు నిర్మించాలి



ఆర్ కొత్తగూడెం-కుర్నపల్లి దారిలో తాలిపేరు కాలువ మీద ఉన్న వంతెనకు రెండు వైపులా రెయిలింగ్‌లు విరిగిపోయాయి. రాత్రి పూట ఈ ప్రాంతం గుండా వెళ్లాలంటే భయంగా ఉంటోంది. ఆర్అండ్‌బీ అధికారులకు తెలిసినప్పటికీ దీనికి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. పెను ప్రమాదం జరుగక ముందే చర్యలు తీసుకోవాలి.

– వై.గిరిబాబు, ఆర్ కొత్తగూడెం

రెండు పక్కలా ప్రమాదమే



టపావాగు వంతెనకు రెండు వైపులా ప్రమాదకరంగా ఉంది. వంతెన అప్రోచ్‌రోడ్‌కు రెండు వైపులా ఉన్న సిమెంట్ దిమ్మెలు విరిగిపోయి ఏ వాహనం అదుపు తప్పి వాగులో పడిపోతోందోనన్న విధంగా ఉంది. ఇక్కడ అత్యవసరంగా రాత్రి వేళల్లో ప్రమాద స్థాయిని తెలిపేందుకు కనీసం రేడియం స్టిక్కర్లను అయినా ఏర్పాటు చేసి అ తరువాత సైడ్ వాల్ నిర్మించాలి.

– టి.నర్సింహారావు, కుదునూరు

సైడ్‌వాల్ వెంటనే నిర్మించాలి



తాలిపేరు వంతెన అప్రోజ్ రోడ్ ప్రాంతంలో దండుపేట వైపు ఇటీవల లారీ ఢీకొట్టిగా సైడ్‌వాల్ విరిగిపోయింది. ఈ ప్రాంతంలో రెండు వైపులా పెద్ద ఎత్తున మట్టి కొట్టుకు పోయి ప్రమాదభరితంగా ఉంది. విరిగిన వాల్‌ను పునఃనిర్మాణం చేయడంతో పాటు అప్రోచ్ రోడ్డుకు మట్టి కొట్టుకు పోయిన ప్రాంతంలో గ్రావెల్ పోసి నింపాలి.

– ఎం.ఆనంద్‌బాబు, తేగడ

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సమితిసింగారం పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి డిగ్రీ కళాశాల వరకు రూ.22.50 లక్షల విలువైన ఎన్ఆర్ఈజీఎస్ సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఎమ్మెల్యేకు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ యూసఫ్, పద్మావతి, సిబ్బంది ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తాను చదివిన ఇదే కళాశాలలోని విద్యార్థులు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకురాగా.. నాలుగు రోజుల్లో పనులు మంజూరు చేయించానన్నారు. అసెంబ్లీ సమావేశంలో నేపథ్యంలో శంకుస్థాపన కార్యక్రమం ఆలస్యమైందన్నారు. పనులు వేగంగా నాణ్యతతో ఈ నెలాఖరులోగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివ, వైస్ ఎంపీపీ కేవీరావు, మాజీ ఉప సర్పంచులు పుచ్చకాయలశంకర్, తరుణ్‌రెడ్డి, వీరంకి వెంకట్రావ్, గోరంట్ల కనకయ్య, గుడిపూడి కోటేశ్వరరావు, గాండ్ల సురేశ్, పాతూరి వెంకన్న, గణేశ్‌రెడ్డి, హరిశంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

దుమ్ముగూడెం: లక్ష్మీనగరం గ్రామంలోని మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రేసు లక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేశంలో అధికారులు మూడు నెలల ప్రగతిని నివేదించారు. కాగా ప్రజాప్రతినిధులు మండలంలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకుని వచ్చారు. ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రేపు సేవాలాల్ జయంతి వేడుకలు

భద్రాచలంటౌన్: ఐటీడీఏ గిరిజన భవన్‌లో ఈ నెల 21న సద్గురు సంత్ సేవాలాల్ మహారాజు జయంతి సందర్భంగా భోగ్ బండారు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంత్ సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు హరిచంద్ర నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలకు బంజారా తెగకు చెందిన వారు, అధికారులకు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గెజిటెడ్ అధికారులను నియమించాలి

భద్రాచలంటౌన్: జిల్లాలో వివిధ శాఖలలో నాన్ గెజిటెడ్ అధికారులను నియమించారని, వారిని తొలగించి గెజిటెడ్ అధికారులను నియమించాలని పీడీఎస్‌యూ భద్రాచలం డివిజన్ కార్యదర్శి మునిగేల శివ ప్రశాంత్ డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం జరిగిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాన్ గెజిటెడ్ అధికారులకు పూర్తి స్థాయిలో ఆ శాఖపై అవగాహన లేకపోవడంతో సమస్యలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలోని ప్రతి శాఖలో గెజిటెడ్ అధికారులను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రక్తదానం..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన షాజ్‌బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ జిందా, దొడ్డిపట్ల కోటేశ్వరరావు సోమవారం హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. కాగా, ఇప్పటి వరకు మహమ్మద్ జిందా 64వ సారి, కోటేశ్వరరావు 19వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వామి నాయుడు రక్తదాతలను అభినందించి బ్లడ్ బ్యాంక్ తరఫున ప్రశంసా పత్రాలను అందజేశారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఇళ్ళు లేని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని దళిత ప్రజా సంఘాల జిల్లా అధ్యక్షుడు అల్లాడి జయరాజు అన్నారు. పట్టణంలోని ఎంపీ కాలనీలో సోమవారం జరిగిన దళిత ప్రజా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సతీష్, ఉదయ్‌కాంత్, ప్రభాకర్, రాములు, శాంతయ్య, కనకరాజు, బాబు, రాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

దమ్మపేట: ఎమ్మార్పీస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలో ఈ నెల 21న నిర్వహించనున్న ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాల సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర కార్యదర్శి కోలికపోగు కాంతారావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీస్ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ఈ నెల 21 న నిర్వహించనున్న ఎమ్మార్పీస్ సదస్సుకు ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని తెలిపారు. కోలికపోగు వెంకటేశ్వరరావు, సీతారాములు, మునలయ్య, పుల్లారావు, వీరయ్య పాల్గొన్నారు.

అశ్వాపురం: మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి ఆధ్వర్యంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధన కోసం ఈ నెల 21 నుంచి చేపడుతున్న మాదిగ జోడో యాత్రను జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు దేపంగి వెంకటరమణ కోరారు. మండల పరిధిలోని మల్లెలమడుగులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న తొలి విడత జోడోయాత్రకు మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో కనుకు కృష్ణ, నంద్రు నరేష్, నందిపాటి వెంకన్న, నాగేష్, వీరయ్య, నర్సయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఆదివాసీకే ఇవ్వాలి

గుండాల: కాంగ్రెస్ పార్టీ తరపున మహబూబాద్ పార్లమెంట్ టికెట్ ఆదివాసీకే ఇవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య దొర డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత15 సంవత్సరాలుగా మూడు దఫాలుగా కాంగ్రెస్ పార్టీ మహబూబాద్ పార్లమెంట్ ఎంపీ టికెట్ ఒకే సామాజిక వర్గానికి చెందిన లంబాడా వారికి ఇవ్వడం ఆదివాసీ సమాజాన్ని అణచివేయడమేనన్నారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ అభ్యర్థి అయిన ఎట్టి వెంకన్నకు టికెట్ ఇవ్వాలని, లేకపోతే ఆదివాసీ ఓట్లు చీలి టీఆర్ఎస్ లేదా బీజేపీ గెలిచే అవకాశం ఉందని హెచ్చరించారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ శ్రీనివాస్

చర్ల: చర్ల తహసీల్దార్‌గా ఎస్.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ఆర్.అనంత రామ కృష్ణకు ఎన్నికల బదిలీల్లో భాగంగా హుమకొండకు బదిలీ కాగా ఆయన స్థానంలో బూపాలపల్లి జిల్లాలోని ఆర్‌డీఓ కార్యాలయంలో డీఏఓగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌ను చర్ల తహసీల్దార్‌గా ఇక్కడికి బదిలీ చేశారు. కాగా శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ..



మణుగూరురూరల్: ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మణుగూరురూరల్: మణుగూరు మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా టి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన ఎం.చంద్రమౌళికి ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లగా...ఖమ్మం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న టి శ్రీనివాసరావు బదిలీపై మణుగూరు వచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు గాండ్ల సురేష్, కొర్సా ఆనంద్, బోడ శ్రీను, రవి, షాబీర్‌పాషా తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



దమ్మపేట: గండుగులపల్లిలో విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించి, ఉత్తమ ఫలితాలు సాధించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాంక్షించారు. సోమవారం మండల పరిధిలోని గండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులకు దాతల సహకారంతో అల్పాహారమును ఎమ్మెల్యే జారే చేతుల మీదుగా వడ్డన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, ఇన్‌చార్జ్ హెచ్ఎం హన్మంతరావు, నాయకులు జూపల్లి ఉపేంద్ర, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి చెకుముఖి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం మైనారిటీ గురుకుల పాఠశాలలో పదోవ తరగతి విద్యార్థినిలతో మాట్లాడి వారి సమస్యలు, బోధన సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, ఎంపీటీసీ సభ్యురాలు వేముల భారతి, కాంగ్రెస్ జిలా నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, జ్యేష్ఠ సత్యనారాయణ, ఎస్‌కే పాషా, నండ్రు రమేష్, మిండా హరి పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు..

నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో మార్చురీ భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. సోమవారం ఆయన అశ్వారావుపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా స్థానికంగా మార్చురీ భవనం లేకపోవడంతో వివిధ కారణాలతో మృతి చెందిన మృతదేహాలకు పోస్టుమార్టం చేసేందుకు అవస్థలు పడుతున్నారని అన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు ఐటీడీఏ నిధుల ద్వారా మార్చురీ భవనం, ఫ్రీజర్ బాక్సుతోపాటు పోస్టుమార్టం చేసేందుకు కావాల్సిన ఆధునిక సామగ్రి కోసం ప్రభుత్వం రూ.24 లక్షల 50వేల రూపాయాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఈ పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, నండ్రు రమేష్, మిండా హరి పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సూచించారు. సోమవారం ములకపాడు క్రీడామైదానంలో గత నెల రోజులుగా జరుగుతున్న డీపీఎల్-2 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో ఆత్మ విశ్వాసం, మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కోసం క్రీడలు సహాయం చేస్తాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో ఆదర్శవంతంగా ఉండాలని, క్రీడాకారులకు సౌకర్యాల కోసం నావంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, బీఆర్ఎస్ నాయకులు అన్నె సత్యనారయణమూర్తి, రావులపల్లి రాంప్రసాద్, కణితి రాముడు, జానీపాషా, దామెర్ల శ్రీనివాస్, దుమ్ముగూడెం యువజన నాయకుడు తెల్లం హరికృష్ణ, నిర్వాహకులు సుమన్, రఘు, హేమంత్, చంటూ, వెంకన్న పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



బాలికలకు బహుమతి అందజేస్తున్న కమాండెంట్ రితేష్ ఠాకుర్

దుమ్ముగూడెం: బాలికలు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని 141 సీఆర్పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ రితేష్ ఠాకుర్ సోమవారం అన్నారు. లక్ష్మీనగరం గ్రామంలోని రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వాలీబాల్ ఫైనల్ పోటీల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలికలు క్రీడాలను ప్రతిభావంతంగా ప్రదర్శించారని, ఇలానే రాణిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 141 సీఆర్పీఎఫ్ సెకండ్ ఇన్ కమాండెంట్‌లు ప్రీతా.సి,కమల్‌వీర్ యాదవ్, డీఎస్పీ రేవతి, సీఐ అశోక్, ఎస్సై గణేష్ పోటు, పాఠశాల హెచ్‌యం ధనసరి నాగమణి పాల్గొన్నారు.

విద్యతోనే జీవితానికి వెలుగు



పాఠశాలను ప్రారంభిస్తున్న తోలెం రమేష్

కరకగూడెం: విద్యతోనే జీవితానికి వెలుగు నిండుతుందని ఆధార్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తోలెం రమేష్ అన్నారు. మండలంలోని కన్నాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగోరుగూడెం వలస ఆదివాసీ గ్రామంలో కోయ పిల్లల కోసం గుడ్ క్లాప్, ఆధార్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పిల్లలను పాఠశాలకు పంపాలని, విద్యతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ప్రభుత్వం కూడా స్పందించి గ్రామంలో మంచి సదుపాయాలతో నూతన పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు తిరుమలరావు, సీఆర్పీ పోలేబోయిన సాంబశివరావు, అంగన్‌వాడీ టీచర్ రవీంద్ర, ఆధార్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు బట్టా బిక్షపతి,గ్రామ పెద్ద మడకం నందయ్య, కలం బీమయ్య, కుంజ రాము పాల్గొన్నారు.

శివాజీ జయంతి శోభాయాత్ర

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఛత్రపతి శివాజీ 395వ జయంతి శోభాయాత్రను బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్థానిక బ్రిడ్జి సెంటర్ నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఆటపాటలతో ఛత్రపతి శివాజీ విగ్రహంతో ఈ శోభాయాత్ర వైభవంగా కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కుంజా ధర్మా తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ రసాభాస



అన్నపురెడ్డిపల్లి: అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయతీలో ఎర్రగుంట రైతువేదిక వద్ద నిర్వహించిన పంచాయతీ గ్రామసభ రసాభసగా సాగింది. సోమవారం పంచాయతీలో చేపట్టే అభివృద్ధి పనులపై పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపీఓ షబ్నా అధ్యక్షతన గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామసభకు పంచాయతీలోని రెండు ప్రధాన పార్టీలకు చెందిన వారు హాజరయ్యారు. అధికార పార్టీకి చెందిన వారు సభలో కూర్చునేందుకు సరిపడా కుర్చీలు లేవనే కారణంతో సభనుంచి బయటికి వెళ్లిపోగా, రెండో వర్గం వారు పనులపై తీర్మానం చేయాలని పట్టుబట్టారు. దీంతో సుమారు రెండు గంటల పాటు గ్రామసభలో గందరగోళం చోటుచేసుకుంది. పనులపై తీర్మానం చేయాలని పలువురు అధికారులను నిలదీశారు. అధికారులు పనులకు సంబంధించిన పూర్తి ప్రొసీడింగ్స్ వచ్చిన తర్వాతే తీర్మానాలు చేస్తామని చెప్పి సభ వాయిదా వేశారు. పంచాయతీలో అభివృద్ధి పనుల కోసం ఏర్పాటు చేసిన గ్రామసభను అధికారులు వాయిదా వేయడంలో ఆంతర్యం ఏంటని ఎంపీటీసీ కాకా సీత ప్రశ్నించారు. మరోసారి గ్రామసభ నిర్వహిస్తామని ఎంపీఓ షబ్నా తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమేష్, శారద, గ్రామస్తులు పాల్గొన్నారు.